
# సహజ పాండిత్యుడు బమ్మెర పోతన



'కలము చేతబట్టి కావ్యంబు రచించె, హలము చేతబట్టి పొలము దున్నె, కలము హలములందు ఘనుడురా' అని ఎవరిని గురించి అన్నారో తెలుసా? ఆంధ్రమహాభాగవతమును ఆంధ్రులకు అందించిన 'సహజపాండిత్యుడు' బమ్మెర పోతన గురించి. తెలుగు సాహిత్య సేవ చేస్తూనే, సేద్యము కూడా చేయడము అతని నిరాడంబరతకు తార్కాణము. భాగవతమును తెలుగులో అందించాలనే సంకల్పము అతనికి చిన్నతనములోనే కలిగింది.

పోతన 'బమ్మెర' అనే గ్రామములో 1450 వ సంవత్సరములో నియోగి బ్రాహ్మణ కుటుంబములో - కేశన్న, లక్కమాంబ దంపతులకు జన్మించాడు. చిన్నతనములోనే వీధి భాగవతమును చూసి, అందులోని విశేషాలను గ్రహించి, ఆ సన్నివేశములలో లీనమై ముగ్ధుడవుతూ భాగవతము రాయడానికి పునాదులు వేసుకున్నాడు. ఇతడు చిన్న వయస్సులోనే అప్పటి ప్రభువు సింగభూపాళుని ఉంపుడుకత్తె 'భోగిని' ని ప్రస్తుతిస్తూ 'భోగినీ దండకము' వ్రాసెను. ఇది అతని నైపుణ్యము పెంపొందించుకోడానికి తోడ్పడింది.

దక్షప్రజాపతి యజ్ఞము చేయ సంకల్పించి, అల్లుడైన శివుడిని ఆహ్వానించక, తన కుమార్తె 'సతీదేవి' సన్నిధిలోనే శివుని తూలనాడగా, ఆమె ఆత్మత్యాగము గావించడము, శివుడు ఆగ్రహించి ఆ యజ్ఞమును ధ్వంసము గావించడము ముఖ్య భూమికగా 'వీరభద్రవిజయము' ను వ్రాసాడు. ఒకనాడు పోతన గోదావరి ఒడ్డున ధ్యానములో నుండగా శ్రీరామచంద్రుడు స్వయముగా వచ్చి శ్రీమద్భాగవతమును వ్రాసి తనకు అంకితమివ్వవలసినదిగా కోరినట్లు భావన కలుగగా, ఆ స్ఫూర్తితో వ్యాసభగవానుని సంస్కృత భాగవతమును తెలుగునకు అనువదించే కార్యమును ప్రారంభించెను.

పలికెడిది భాగవతమట
పలికించెడివాడు రామభద్రుండట నే
పలికిన భవ హరమగునట
పలికెద వేరొండు గాథ పలుకగ నేలా!!

అంటూ భాగవతమును ప్రారంభించడములో అతని గొప్పదనము విశదమవుతున్నది. క్రింది పద్యముల వలన అతనికి శ్రీమద్భాగవతమును మర్త్యులైన రాజులకు అంకితమివ్వడము ఇష్టము లేదనే విషయము తెలుస్తుంది. వరంగల్ పాలకుడైన సింగభూపాలుడు శ్రీమద్భాగవతమును అతనికి అంకితమివ్వవలసినదిగా ఆజ్ఞాపిస్తే, అతని ఆజ్ఞను తిరస్కరించి, రామునికి అంకితమివ్వడము అతని భక్తికి, అంకిత భావానికి తార్కాణము.

బాల రసాల సాల నవ పల్లవ కోమల కావ్య కన్యకన్
కూళల కిచ్చి యప్పడుపు కూడు భుజించుట కంటె సత్కవుల్
హాలికులైన నేమి గహనాంతర సీమల కందమూలకౌ
ద్దాలికులైన నేమి నిజ దార సుతోదర పోషణార్థమై !!

కాటుక కంటి నీరు చను కట్టు పయింబడ నేల యేడ్చెదో
కైటభ దైత్య మర్దనుని గాదిలి కోడల యో మదంబ యో
హాటక గర్భు రాణి నిను నాకటికిన్ గొని పోయి యెల్ల క
ర్ణాట కిరాట కీచకులకమ్మ త్రిశుద్ధిగ నమ్ము భారతీ !!

ప్రహ్లాదచరితము, గజేంద్రమోక్షములోని ఘట్టములు, అందులోని పద్యములు పలువురకు కంఠోపాఠము. అందులో ఉపయోగించిన పదములు, చక్కని అలంకారములు వాటికవే సాటి. ఏదైనా చక్కని కావ్యము చదివినప్పుడు దీనిని ఇలా కూడా వ్రాయవచ్చా? ఎంత చక్కగా పదాల్ని వాడాడు ఈ రచయిత అని అనుకోవడం సర్వసాధారణము. కాని పోతన భాగవతములో ఆ పదాల్ని అలాగే వాడాలి. సందర్భోచితమైన ఆ పదములకు సాటియైన వేరే పదములు దొరకవని పండిత జనులు చెప్పడము - పదాలపై పోతనకు గల పట్టు, వాటిని ఉపయోగించడములో నేర్పు తెలియజేస్తుంది. ప్రహ్లాద చరితము నుండి కొన్ని పద్యములు క్రింద చదివి ఆనందించండి. విన్నవైనా మళ్ళీ మళ్ళీ వినాలని అనిపించే ఆ పద్యముల గొప్పతనము కొనియాడడానికి తగిన పదము దొరకదు. వాటిని గురించి ఎంత చెప్పినా తక్కువే.

ప్రహ్లాదునికి విద్యాభ్యాసము గావించుటకు హిరణ్య కశిపుడు పంపే సందర్భములో చెప్పిన పద్యము.

చదువని వాడజ్ఞుండగు
చదివిన సదసద్వివేక చతురత గలుగున్ !
చదువగ వలయును జనులకు
చదివించెద నార్యులొద్ద చదువుము తండ్రీ !

విద్యాభ్యాసానంతరము తండ్రి వద్దకు వచ్చిన ప్రహ్లాదుడు తాను నేర్చుకున్న విషయములను తండ్రి సమక్షములో ప్రస్తావించు సందర్భములో కొన్ని పద్యములు.

చదివించిరి నను గురువులు
చదివితి ధర్మార్థ ముఖ్య శాస్త్రంబులు నే
చదివినవి గలవు పెక్కులు
చదువులలో మర్మమెల్ల చదివితి తండ్రీ !!

ఇందు గలడందు లేడని
సందేహము వలదు చక్రి సర్వోపగతుం
డెందెందు వెదకి జూచిన
అందందే గలడు దానవాగ్రణి వింటే !!

మందార మకరంద మాధుర్యమున దేలు
మధుపంబు బోవునే మదనములకు !
నిర్మల మందాకినీ వీచికల దూగు
రాయంచ చనునె తరంగిణులకు !
లలిత రసాల పల్లవ ఖాదియై చొక్కు
కోయిల సేరునే కుటజములకు !
పూర్ణేందు చంద్రికా స్ఫురిత చకోరక
మ్మరుగునే సాంద్ర నీహారములకు !

అంబుజోదర దివ్య పాదారవింద
చింతనామృత పాన విశేష మత్త
చిత్త మే రీతి నితరంబు చేర నేర్చు
వినుత గుణ శీల మాటలు వేయు నేల !!

కమలాక్షు నర్చించు కరములు కరములు
శ్రీనాథు వర్ణించు జిహ్వా జిహ్వా
సుర రక్షకుని జూచు చూడ్కులు చూడ్కులు
శేషశాయికి మ్రొక్కు శిరము శిరము
విష్ణు నాకర్ణించు వీనులు వీనులు
మధువైరి దవిలిన మనము మనము
భగవంతు వలగొను పదములు పదములు
పురుశోత్తముని మీది బుద్ధి బుద్ధి
దేవదేవుని జింతించు దినము దినము
చక్రహస్తుని బ్రకటించు చదువు చదువు
కుంభినీధవు జెప్పెడి గురుడు గురుడు
తండ్రి! హరి జేరుమనియెడి తండ్రి తండ్రి!

ఈ పై పద్యములు అతి మధురముగా, విన సొంపుగా, ఒకసారి వింటే నాల్కలపై నాట్యము చేస్తూ ఉంటాయి.

ఇక గజేంద్రమోక్షములో పద్యాలు ప్రతి అంశపు గమనము పద్యములో ప్రతిబింబిస్తూ ఉంటాయి. ఉదాహరణకు కొన్ని గమనించండి. గజేంద్రుని మొసలి పట్టుకున్న సందర్భములో పద్యపు నడక చూడండి.

కరి దిగుచు మకరి సరసికి
కరి దరికిని మకరి దిగుచు కరకరి బెరయన్
కరికి మకరి మకరికి కరి
భరమనుచును నతల కుతల భటులరుదు పడన్ !!

మొసలితో పోరాడి పోరాడి ఓపిక సన్నగిల్లుతున్న తరుణాన, మదిలో మెదలిన ఆలోచనలను, హరికి మొరపెట్టుకొను సన్నివేశములను (శరణాగతిని) చిత్రీకరించిన తీరుతెన్నులను అద్యంతమూ తిలకించండి (మీకు ఆ దృశ్యము కన్నులకు కట్టినట్లు అగుపిస్తుందనడములో సందేహము లేదు).

కలడందురు దీనుల యెడ
కలడందురు భక్త యోగి గణముల పాలం
గలడందురన్ని దిశలను
కలడు కలండనెడు వాడు కలడో లేడో !!

లోకంబులు లోకేశులు
లోకస్థులు తెగిన తుది నలోకంబగు పెం
జీకటి కవ్వల నెవ్వడు
ఏకాకృతి వెల్గు నతని నే భజియింతున్ !!

ఎవ్వని చే( జనించు జగ? మెవ్వని లోపల నుండు లీనమై?
ఎవ్వని యందు డిందు? పరమేశ్వరుడెవ్వడు? మూల కారణం
బెవ్వ? డనాది మధ్య లయుడెవ్వడు? సర్వము తానె యైన వా
డెవ్వడు? వాని నాత్మ భవు నీశ్వరు నే శరణంబు వేడెదన్ !!

లావొక్కింతయు లేదు ధైర్యము విలోలంబయ్యె ప్రాణంబులున్
ఠావుల్ దప్పెను మూర్ఛ వచ్చె తనువున్ డస్సెన్ శ్రమంబయ్యెడిన్
నీవే తప్ప ఇతః పరంబెరుగ మన్నింపం దగున్ దీనునిన్
రావే ఈశ్వర కావవే వరద సంరక్షింపు భద్రాత్మకా !!

శరణాగత రక్షణకై వెడలిన హరి కదలికలను వర్ణించిన వైనం చూడండి.

అల వైకుంఠ పురంబులో నగరిలో నా మూల సౌధంబు దా
పల మందార వనాంతరామృత సర: ప్రాంతేందు కాంతోపలో
త్పల పర్యంక రమా వినోది యగు నాపన్న: ప్రసన్నుండు వి
హ్వల నాగేంద్రము పాహి పాహి యన గుయ్యాలించి సంరంభి యై !!

సిరికిం జెప్పడు శంఖ చక్ర యుగముం చేదోయి సంధింప డే
పరివారంబును జీర డభ్రగపతిన్ మన్నింపడా కర్ణికాం
తర ధమ్మిల్లము చక్కనొత్తడు వివాద ప్రోద్ధిత శ్రీ కుచో
పరి చేలాంచలమైన వీడడు గజప్రాణా వనోత్సాహి యై !!

అడిగెద నని కడు వడి జను
అడిగిన తన మగుడ నుడువడని నెడయుడుగున్
వెడ వెడ జిడి ముడి తడ బడ
నడుగిడు నడిగిడదు జడిమ నడుగిడు నెడలన్ !!

ఇవి చదివిన తరువాత భాగవతము చదవాలనే తలంపు మీలో కలిగే ఉండాలి. పై పద్యములకు పూర్తి వివరణ, ప్రతి పదార్థము తెలియగోరితే susri@sanghamitra.org కు e_mail పంపించండి. తెలుసుకోగోరే వారి సంఖ్యను బట్టి దానిని వచ్చే సంచికలో అందిస్తాము.